క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి పూజలు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 14వ తేదీన గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

దివ్యాంగురాలికి ఎమ్మెల్యే చేయూత



భారతికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు డొప్పా భారతికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కోసం ఆ గ్రామానికి విచ్చేసిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దివ్యాంగురాలు భారతి ఇబ్బందులను చూసి అక్కడికక్కడే ఆర్థికసాయం అందజేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల, చింతచెలికలోని ఓవెల్–18 పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలను ఎంఈఓ జి.వసంత కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్ని వసతులతో పరీక్షలు నిర్వహిస్తుండడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎంలు సీహెచ్ లక్ష్మీప్రసూన, హరిబాబు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



వెంకటాచలం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని కంటేపల్లి ఎస్సీకాలనీలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సీఐ గంగాధర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు కర్నాటి శివకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



వెంకటాచలం: మండలంలోని కసుమూరు పంచాయతీలో కొండపై నివసిస్తున్న చల్లా యానాది కుటుంబాల మహిళలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద చల్లా యానాది కుటుంబాలకు మంత్రి కాకాణి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

నెల్లూరు రూరల్: పొట్టేపాళెం సమీపంలో పెన్నానది ఒడ్డున నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్‌ఈబీ – 2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఐదుగురితో పాటు నాలుగు పందెం కోళ్లు, రూ.1550 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడారు. కోడి పందేలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా పాదయాత్ర

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కేక్ కట్ కట్ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాసంకల్పయాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రను ప్రజలు విశ్వసించారని, అందుకే ఆయనను ముఖ్యమంత్రిని చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు ప్రాంతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర నిర్వహించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పొదలకూరులో వేడుకలు నిర్వహించారు. మంత్రి కాకాణి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 90 శాతం పూర్తిచేసినట్లు తెలిపారు. పాదయాత్రలు చాలామంది చేస్తుంటారని, అయితే వాటికి విలువ, విశ్వసనీయత ఉండాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రను గుర్తు చేసుకుంటే నభూతో నభవిష్యత్ అన్న విధంగా సాగిందన్నారు. ఇసుక వేస్తే రానంత జనం వచ్చారని గుర్తుచేసుకున్నారు. గతంలో ప్రజలకు హామీలను ఇవ్వడం.. ఓట్లు దండుకోవడం వంటి విధానాలకు భిన్నంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. పాదయాత్ర అంటే ప్రజల్లో మమేకం కావాలని, వారి సమస్యలను వినాలని అన్నారు. చంద్రబాబు నాయుడు కూడా గతంలో పాదయాత్ర చేశారని, అయితే ఆయన రాత్రి వేళల్లో అందరూ నిద్రపోయిన తర్వాత ఎండ తగలకుండా గ్రామాలు దాటుకుంటూ వెళ్లిపోయారని విమర్శించారు. ఆయన కుమారుడు లోకేష్ పాదయాత్ర చేస్తానని ప్రకటించాడని, పాదయాత్ర చేసినంత మాత్రాన ప్రజలు గెలిపించరని, నాయకుడిని నమ్మితేనే ఓట్లు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు ఎస్‌కే అంజాద్, మూలి సతీష్‌రెడ్డి, యాతం పెంచలరెడ్డి, డి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

కొడవలూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకొనేందుకు కృషి చేద్దామని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.ఓబులేసు తెలిపారు. సోమవారం ఆ పాఠశాల ప్రాంగణంలో కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లు, సర్పంచ్‌లతో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడులను అన్నివిధాలా అభివృద్ధి చేస్తోందన్నారు. దాతల సహకారం తీసుకొని పాఠశాలలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ బి.సుప్రియ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ జి.విజయలక్ష్మి, కాంప్లెక్స్ కార్యదర్శి సి.మోహన్‌రావు, రిసోర్స్‌పర్సన్ ఒ.రామచంద్రయ్య, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గుండాలమ్మపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం మండలంలోని గుండాలమ్మపాళెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికీ వెళ్లి క్యాలెండర్లు, కరపత్రాలు అందజేసి పేర్నాటిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ పార్టీ బలపరచిన అభ్యర్థిని గెలిపించుకొనేందుకు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే మండలంలోని గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసి రెండో విడత ప్రచారానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పానేటి శీనయ్య, చింతల శ్రీనివాసులు, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కోఆర్డినేటర్‌గా సిరాజ్



నియామకపత్రం అందుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయుడు సిరాజ్

బుచ్చిరెడ్డిపాళెం: ఖేలో ఇండియా ఫిట్నెస్ అసెస్మెంట్ యాప్ జిల్లా కోఆర్డినేటర్‌గా మండలంలోని పెనుబల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌డీ సిరాజ్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పాఠశాల హెచ్‌ఎం పీవీ రత్నం నియామకపత్రాన్ని సిరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుడు సిరాజ్ ఖేలో ఇండియా కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రతి పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ద్రవరూప యూరియాతో మేలు



జగదేవిపేటలో వరి పొలంలో రైతుకు సూచనలిస్తున్న ఏడీ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట: గుళికల రూపంలో ఉన్న యూరియా కన్నా ద్రవరూపంలో ఉన్న నానో యూరియా అధిక రెట్లు మొక్కకు ప్రయోజనం కలిగిస్తుందని వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఏడీ కార్యాలయంలో సోమవారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో 500 ఎంఎల్ నానో యూరియా ఎకరానికి సరిపోతుందన్నారు. అనంతరం జగదేవిపేట, ఇందుకూరుపేట గ్రామాల్లోని వరి పొలాలను సందర్శించారు. ఈ ప్రాంతంలో ఎలుకలు ఎక్కువగా ఉండడాన్ని గమనించి నివారణ మార్గాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ టీషర్ట్ ఆవిష్కరణ



టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు: మనుబోలులో ఈ నెల 12వ తేదీ నుంచి జరగనున్న ఎస్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ టీషర్ట్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం నెల్లూరులోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డి మనుబోలు మండలంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. కాగా విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదు బహుమతి, రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి అందజేయనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనమాల ప్రభాకర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, సేవానాథం ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్పందన'తో సమస్యల పరిష్కారం



వినతిపత్రం స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం లభించిందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై అర్జీలను చైర్‌పర్సన్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారాని చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కాకాణి పరామర్శ

మనుబోలు: మండలంలోని బండేపల్లి సర్పంచ్ ఆవుల వెంకటరమణయ్య తండ్రి శ్రీనివాసులు సోమవారం మృతిచెందడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. బండేపల్లిలోని వెంకటరమణయ్య ఇంటికి వెళ్లి శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. వెంకటరమణయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చేడిమాల బుజ్జిరెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఆవుల తులసీరాం, రవీందర్‌రెడ్డి, జగదీష్, రమేష్ తదితరులు ఉన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తోటపల్లిగూడూరు: సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట వంటి జూదాలను నిర్వహించడం చట్టరీత్యా నేరమని, మండలంలో ఎవరైనా ఇలాంటి జూదాలను నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కోడిపందేలు నిర్వహించే అవకాశం ఉన్న కాటేపల్లి, వెంకన్నపాళెం పట్టపుపాళెం, కోడూరుపట్టపుపాళెం, రవీంద్రపట్టపుపాళెం, ఇసుకదొరువు తదితర గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విశేషాలంకారంలో రంగడి దర్శనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని కనులపండువగా సోమవారం నిర్వహించారు. స్వామి వారు ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువై ఉత్తర ద్వారం నుంచి భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తగా నరసింహులుశెట్టి వ్యవహరించారు.

- ఆండాళ్ అమ్మవారి ప్రాకారోత్సవాన్ని మంగళవారం ఉదయం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

బాబు, పవన్‌లను ప్రజలు విశ్వసించరు



సంక్షేమ పథకాల గురించి దివ్యాంగుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- సంక్రాంతి ప్యాకేజీ కోసమే బాబుతో పవన్‌కల్యాణ్ భేటీ
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఎన్ని డ్రామాలు ఆడినా రాష్ట్ర ప్రజలు వారిని విశ్వసించరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలను కలుసుకొని వారి సమస్యలు విన్నారని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సంక్షేమ పథకాల కోసం ఇప్పటివరకు రూ.1.85 లక్షల కోట్లను ఖర్చు చేసి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకుసాగుతున్నామని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 46 సచివాలయాల పరిధిలో 51,865 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యామని తెలిపారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో 2,747 మంది లబ్ధిదారులకు గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.16.29 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులకు మాత్రమే పథకాలు అందేవన్నారు.

ప్యాకేజీ కోసమే బాబు వద్దకు పవన్

సంక్రాంతి సమీస్తుండడంతో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్యాకేజీ కోసమే ప్రతిపక్షనేత చంద్రబాబుతో భేటీ అయ్యారని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దుయ్యబట్టాడు. వీళ్లు ప్రజా సేవకులు కాదని విమర్శించారు. అనంతరం గంగపట్నం గ్రామంలో 13 స్వయం సహాయక సంఘాలకు రూ.1.28 కోట్ల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, కేతిరెడ్డి సతీష్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, కొండూరు కృష్ణారెడ్డి, మారుబోయిన సంతోష్‌గౌడ్, సిద్ధవరపు గోపాల్‌రెడ్డి, కావలి రవి, శిగినం సుబ్రహ్మణ్యం, ఎ.పక్కీరయ్య, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు సిద్ధవరపు రమ్యశ్రీ, తంబు గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: స్థానికంగా ఉన్న రెండు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో కొడవలూరులో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నారని, ఈ లోపు అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేసి ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ వంతెన, ఆర్వో ప్లాంటు పూర్తిచేయాలన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి పనులు పూర్తి చేయించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పి.సురేష్‌కుమార్, ఎ.రమేష్, ఏపీఎం ఎస్.రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, సర్పంచ్ ఎస్.కామాక్షి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.ప్రతాప్, నాయకులు ఒ.సునీతమ్మ, ఎన్.తిరుపతమ్మ, పి.రవి, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం

- సెంబ్‌కార్ప్ ప్రాజెక్టు వద్ద ధర్నా



ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ముత్తుకూరు: బహిరంగ విచారణ సమయంలో సెంబ్‌కార్ప్ ప్రాజెక్టు యాజమాన్యం ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని పైనాపురం గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని పైనాపురంలో ఉన్న ఆ ప్రాజెక్టు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ బీటెక్ చదువుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలంటూ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ప్రాజెక్టు యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టుకు ప్రయాణించే భారీ బల్కర్ల ధాటికి పలువురు గ్రామస్తులు మృతిచెందారని, మృతుల కుటుంబాలను ఆదుకోవడంలో నిర్వాహకులు విఫలమయ్యారని ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని, ఆస్పత్రి నిర్మిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చనందున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సోమిరెడ్డి హయాంలో ప్యాకేజీ నిధులు స్వాహా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముత్తుకూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మత్స్యకారేతర ప్యాకేజీ సాధించకుండా నిద్రపోయావా అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య, ఎంపీపీ సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, నాయకులు ముత్యంగౌడ్ తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్యాకేజీ పేరుతో 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక చీకటి జీఓను సృష్టించిన సోమిరెడ్డి కొంతమందికి మాత్రమే పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఈ సమయంలోనే సుమారు 600 ఎస్టీ కుటుంబాల ప్యాకేజీ నిధులు స్వాహా అయ్యాయని, ఈ నిధులు ఎవరు కాజేశారో విచారణ జరిపించాలని కలెక్టర్‌తోపాటు మంత్రి కాకాణికి విజ్ఞప్తి చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా



వావిళ్ల రైతుభరోసా కేంద్రానికి వచ్చిన యూరియా లోడ్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలో వరి సాగు చేసే రైతులకు యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో విడవలూరు మండలంలోని చౌకచెర్ల, దంపూరు, రామతీర్థం, విడవలూరు, వావిళ్లలోని రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలకు 81 టన్నుల యూరియా వచ్చిందన్నారు. అలాగే మంగళ, బుధవారాల్లో మరో 100 టన్నుల వరకు యూరియా విడవలూరు మండలానికి వస్తుందని, రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరమైన రైతులు సమీపంలోని రైతుభరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా యూరియాను పొందవచ్చన్నారు.